క్లుప్తంగా

నేడు ధ్యాన మహాసభ

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో కొలువై ఉన్న నూకాలమ్మ ఆలయంలో సోమవారం ధ్యాన మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పారాయణ కమిటీ అధ్యక్షురాలు సత్తి అరుణ ప్రోత్సాహంతో శ్రీకాళహస్తి వాసి మునిబాబుచే ఈ మహాసభ జరుగుతుందన్నారు. 2,500 సంవత్సరాల క్రితం బుద్ధుడు ఉపదేశించిన అనాపానసతి అనే శ్వాసక్రియ ద్వారా ఒక అద్భుత ప్రపంచం పరిచయం అవుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

శివరాత్రి ఉత్సవాలకు పందిరి రాట

పిఠాపురం: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పిఠాపురంలో స్వయంభువుగా వెలసిన శ్రీ కుక్కుటేశ్వర స్వామి మహాశివరాత్రి మహోత్సవాలకు సోమవారం పందిరి రాట వేయనున్నట్లు ఆలయ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తెలిపారు. ఈ పందిరి రాట ముహూర్తం కార్యక్రమానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు సతీసమేతంగా హాజరవుతారన్నారు.

ఘనంగా ముగిసిన ఉరుస్ ఉత్సవం



దర్గా వద్ద అన్నదానం చేస్తున్న ముస్లింలు

పెద్దాపురం: హాజరత్ షేక్ మదీనా పాశ్చా ఔలియా ఉరుస్ గంధోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. సాహెబ్ సమాధి వద్ద మతాలకు అతీతంగా సుమారు ఐదు వేల మందికి భారీ అన్నదానం చేశారు. దర్గా కమిటీ చైర్మన్ ఎం ఎల్ అలీ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కౌన్సిలర్లు బాబులాల్, ఆశిక్ ఆలీ, రఫీ, జలీల్, షబ్బీర్, హాఫీజ్, బాబ్జీ, రిజ్వాన్, ముక్తార్ అలీ, ఆరీఫ్, ఇర్షద్ అలీ, జాకీర్, ఖదీర, నరేష్, రాజేష్, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

పద్మారెడ్డి కుటుంబానికి పరామర్శ

కొత్తపల్లి: మండలంలోని కొత్త ఇసుకపల్లికి చెందిన బీజేపీ నాయకుడు చింతపల్లి పద్మారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర కిసాన్ మోర్చా బీజేపీ అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పార్టీకి పద్మారెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. పరామర్శించిన వారిలో ఉమ్మడి మాజీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కంటిపూడి సర్వారాయుడు, పవన్, శాస్త్రి, దాట్ల సూర్యనారాయణరాజు, రవణం సుబ్రమణ్యం తదితరులున్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేత నవర జట్టు



విజేతలకు షీల్డు అందజేస్తున్న దృశ్యం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో నవర, తాటిపర్తి జట్లు పోటీ పడగా నవర జట్టు విన్నర్‌గాను, తాటిపర్తి జట్టు రన్నర్‌గా నిలిచాయి. గ్రామ ఉప సర్పంచ్ దాసం వెంకటేష్, వైస్ ఎంపీపీ నేమాని ఆదివిష్ణుల చేతుల మీదుగా విన్నర్‌కు రూ.20వేలు, షీల్డు, రన్నర్‌కు రూ.10వేలు, షీల్డును అందజేశారు. కార్యక్రమంలో ఆకోటి ప్రభాకరశాస్త్రి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి గారపాటి సురేష్, దాసం బాబు, ఉంగరాల వీరబాబు, స్వామిరెడ్డి గంగాధర్, గారపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కృషితో లక్ష్యాల సాధన

బోట్‌క్లబ్: కృషి ఉంటే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చునని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ ఏకే రిషి అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం సైకాలజిస్ట్ జి.శశిభూషణ్ అధ్యక్షతన కెరీర్ ఎక్స్‌పో నిర్వహించారు. పోటీ ప్రపంచంలో ప్రతి నిమిషం ఎంతో విలువైనదని, సమయపాలన లేకుంటే అనుకున్నది సాధించలేమని అన్నారు. విద్యార్థులు కెరీర్‌పై పట్టు ఎలా సాధించాలో శశిభూషణ్ వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు నిర్వహించిన విజేతకు బహుమతులు అందించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



అలరించిన సాంస్కృతిక కార్యక్రమం

పిఠాపురం: పిఠాపురం టౌన్‌లో ఉన్న ఆదిత్య పాఠశాలలో ఆదివారం శృతిలయ సంగీత కూచిపూడి నాట్యాలయ 8వ వార్షికోత్సవ వేడుకల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాట్య గురువు కొత్త ప్రవీణ విశ్వేశ్వరరావు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది.

ప్రశాంతంగా పోలీసు పరీక్షలు

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ
- 813 మంది అభ్యర్థులు హాజరు



మహారాణి కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



పరీక్షా కేంద్రం వద్ద క్యూ కట్టిన అభ్యర్థులు

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు ఆదివారం పెద్దాపురం సబ్ డివిజన్‌లో ప్రశాంతంగా ముగిశాయి. ఇన్‌చార్జి డీఎస్పీ మొగిలి వెంకటేశ్వరరావు ఆధ్వ ర్యంలో దివిలి కిట్స్, సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు స్థానిక మహారాణి కళాశాలలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించారు. ఆయా పరీక్షా కేంద్రాలను ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, ఏఎస్పీలు శ్రీనివాస్, అంబికా ప్రసాద్ పరిశీలించారు. కాగా ఆయా పరీక్షా కేంద్రా ల్లో 900 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 813 మంది హాజరై, 87 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. సీఐ అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వెలుగుల సురేష్ ఆయా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు.

కిటకిటలాడిన బస్సు కాంప్లెక్స్, హోటళ్లు

సామర్లకోట: పోలీసు కానిస్టేబుల్ పరీక్షల కోసం శ్రీకాకుళం, విశాఖపట్నం, తుని, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి సామర్లకోట వచ్చిన అభ్యర్థులతో స్టేషన్ సెంటర్ కిటకిటలాడింది. ఇక్కడి నుంచి డివిజన్‌లోని నాలుగు కేంద్రాల్లో పరీక్షలు పరీక్షలు రాసి తిరిగి వచ్చారు. అభ్యర్థుల రాకతో బస్సులు, హోటళ్లు కిటకిటలాడాయి. హోటల్స్‌లోకి వెళ్లడానికి క్యూ కట్టాల్సి వచ్చింది. కాగా హోటళ్ల యజమాను లు టిఫిన్లు సరఫరా చేయలేక ఇబ్బంది పడ్డారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ ఉద్యోగ రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులను సీఐ వైఆర్కే పర్యవేక్షణలో సిబ్బంది తనిఖీ చేశారు. 897 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 103 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.



పరీక్ష కేంద్రం పరిశీలనకు వచ్చిన ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని హోటళ్ల వద్ద అభ్యర్థుల రద్దీ

జగన్ పాలన దేశానికే ఆదర్శం



పిఠాపురంలో లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: సంక్షేమ పాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మున్సిపాలిటీలోని 5, 6 వార్డుల్లో ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతోందన్నారు. అవినీతికి తావులేకుండా అర్హులందరికీ ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. మూడు సంవత్సరాల కాలంలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ అమలు చేశారని కొనియాడారు. చంద్రబాబును ప్రజలు ఛీ కొట్టినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకొని ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవరత్న పథకాలతో సీఎం పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొజ్జ రామయ్య, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబి, కొత్తపల్లి బుజ్జి, సచివాలయ కోఆర్డినేటర్ బాలిపల్లి రాంబాబు, కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలున్నాయ్.. పిక్కలు జాగ్రత్త

- పట్టణంలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు
- చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులు
- పట్టుకోవడానికి భయపడుతున్న అధికారులు



సామర్లకోటలో రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

సామర్లకోట: పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వార్డుల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ వృద్ధులు, పిల్లలపై దాడులు చేస్తున్నాయి. దీంతో పట్టణ వాసులు భయాందోళన చెందుతున్నారు. ఎక్కడికక్కడ వీధి కుక్కలు దాడులు చేయడంతో పిల్లలు, పెద్దలు ఒంటరిగా ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇటీవల కాలంలో ఎక్కడ బడితే అక్కడ శునాకాలు గుంపులు గుంపులుగా తిలుగుతున్నాయి. వీటిలో కొన్ని పిచ్చి కుక్కలు మారి మనుషులను కరుస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో కుక్కలను నివారించాలని ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ కౌన్సిలర్లు మొరపెట్టుకుంటున్నారు. మున్సిపల్ అధికారులు కుక్కలను చంపిస్తున్నట్టు తెలిస్తే వారిపై కేసులు నమోదవుతున్నాయి. దాంతో అధికారులు కుక్కలను చంపడానికి ముందుకు కావడం లేదు. కాగా కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవడానికి అంగీకరిస్తున్నారు. కుక్కలకు సంతంతి నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తామని గత 10 ఏళ్ల ప్రచారం జరుగుతున్నా ఆచరణలోనికి మాత్రం రావడం లేదు. ఇటీవల పశుసంవర్ధక శాఖ అధికారులతో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు సమావేశం ఏర్పాటు చేసి కుక్కలకు ఆపరేషన్లపై చర్చించారు.

ప్రచారానికే పరిమితం



పట్టణంలో కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటామని గత కౌన్సిల్ నుంచి అధికారులు హామీ ఇస్తున్నారు. కాగా ఆ హామీలు ప్రచారానికే పరిమితమవుతున్నాయి. వీధి కుక్కలకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయాలి. కుక్కలను సంతాన నివారణ ఆపరేషన్ల ప్రక్రియను వేగంగా ప్రారంభించాలి. పిచ్చి కుక్కలను గుర్తించి వాటిని అటవీ శాఖాధికారులకు అప్పగించాలి.

ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్, సామర్లకోట

కౌన్సిల్‌లో తీర్మానం



మున్సిపాలిటీ పరిధిలోని వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయించడానికి చైర్‌పర్సన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించాం. ఈ నెలలో కౌన్సిల్‌లో తీర్మానం చేసి వీధి కుక్కలకు ఆపరేషన్ల ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. కుక్కలను పెంచే యజమానులు తమ కుక్కలకు లైసెన్సు తీసుకోవాలి. పెంపుడు కుక్కలకు తప్పని సరిగా ఆరు నెలలకు ఒకసారి యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయించాలి.

నయీం అహ్మద్, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: నాడు–నేడుతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురంలో సీతారాంపురం 6వ వార్డులో ఉన్న విజయాంధ్ర మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో లేని విధంగా ముఖ్యమంత్రి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలనే కాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం ఉన్నత స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి పాలకవర్గం కృషిచేయాలి



సర్పవరం భావనారాయణ స్వామి ఆలయ నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: నారద మహర్షి ప్రతిష్టించిన సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయానికి పురాతన ప్రాశస్త్యం ఉందని, దర్శనాలకు వచ్చి భక్తుల పట్ల గౌరవంగా ఉంటూ వారికి మెరుగైన వసతుల కల్పనతో పాటు ఆలయ అభివృద్ధికి పాటు పడాలని నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచించారు. ఆలయ నూతన కార్యవర్గం వివరాలను ఈఓ విజయలక్ష్మి ప్రకటించారు. చైర్మన్‌గా పుల్ల నారాయణరావును పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. చైర్మన్, సభ్యులతో ఈఓ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఆలయ అభివృద్ధికి నిధులు కోరామన్నారు. ఈఓ విజయలక్ష్మి, సిబ్బంది, కురసాల కళ్యాణకృష్ణ, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, గ్రామ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, ఎంపీటీసీలు గుత్తుల శ్రీనివాసరావు, సారా రాజేష్, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం : ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పుల్ల నారాయణరావు, సభ్యులుగా లోలబట్టు శ్యామలదేవి, శీలం అప్పారావు, జోకా సత్తిబాబు, పుల్ల వీర వెంకట సత్యనారాయణ, పులగల మరిడమ్మ, గంటసాల బద్రీనారాయణ, వాసంశెట్టి వీరలక్ష్మి, పెద్దిరెడ్డి వెంకటాచార్యులు ఎన్నికయ్యారు.

పరిశుభ్రతే దేశ ప్రగతికి సోపానం



హోప్ ఐలాండ్‌ను శుభ్రం చేస్తున్న అధికారులు

బోట్‌క్లబ్: పరిశుభ్రతే ప్రగతికి సోపానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ సాదు నరసింహారెడ్డి అన్నారు. కస్టమ్స్ యాక్ట్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వచ్ఛ పక్వాడలో భాగంగా కాకినాడ కస్టమ్ హౌస్ ఆధ్వర్యంలో కాకినాడ సీపోర్టు లిమిటెడ్, పోర్టు డిపార్టుమెంట్, అటవీశాఖ, ఆల్‌ఈజీవెల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హోప్ ఐలాండ్‌లో పరిసరాలను ఆదివారం శుభ్రం చేశారు. వ్యర్థాలను కాకినాడ నగరపాలక సంస్థ డంపింగ్ యార్డుకు తరలించారు. సీపోర్టు లిమిటెడ్ సీఈఓ మురళీధర్ మాట్లాడుతూ ఎన్టీ ఆర్ బీచ్‌ను రెండేళ్ల దత్తత తీసుకుని ఆరుగురు సిబ్బందితో నిత్యం శుభ్రం చేస్తున్నట్టు తెలిపారు. పోర్టు అధికారి శ్రీధర్మశాస్త, ట్రస్ట్ హాస్పిటల్ ఎండీ రామకృష్ణ, కస్టమ్స్ సూపరింటెండెంట్లు, ఆల్ ఈజీవెల్ సభ్యులు పాల్గొన్నారు.

తురగాకు మిలీనియం అవార్డు

కాకినాడ కల్చరల్: స్థానిక కళాకారుడు, సమాజసేవకుడు తురగా సూర్యారావుకు మిలీనియం ఆఫ్ ది ఇయర్–2023 అవార్డు ప్రదానం చేశారు. సూర్యచంద్ర కల్చరల్ అండ్ ఈవెంట్స్ ఆర్గనైజేషన్ యేటా రిపబ్లిక్ డే నాడు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరిస్తుంది. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తురగా కళా సేవకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రదానం చేసినట్టు ఆర్గనైజేషన్ అధ్యక్షులు పి.మోహన్‌చంద్ర అన్నారు. నగర ప్రముఖులు, కళాకారులు తురగాను అభినందించారు

ఇష్టంతో చదువుతున్నారు

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న గ్రంథాలయాల శాఖల్లో ఆదివారం నిర్వహిస్తున్న 'చదవడం మాకిష్టం' కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోంది. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై చందమామ కథలు, అల్లాడిన్, ది ప్లాంట్ కింగ్డమ్ తదితర పుస్తకాలు అభ్యసిస్తున్నారు.

మామిడితోటలో పూర్వ విద్యార్థుల సందడి



కరపలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల 1994–95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక రైతు తుమ్మలపల్లి రాము మామిడితోటలో సందడిచేశారు. కుటుంబ సమేతంగా వచ్చి నాటి ముచ్చట్లలో మునిగి తేలారు. అప్పటి అల్లర్లు, చెట్టాపట్టాలు గుర్తు చేసుకుంటూ, నేడు ఏంచేస్తున్నారు సమచారాన్ని ఇచ్చిపుచ్చుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట, పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఆ బ్యాచ్‌లోని తుమ్మలపల్లి మహేశ్వరరావు, కొలిలింక రాజా, వసంశెట్టి రాము, పేర్నిడి మూర్తి, అనిశెట్టి శ్రీను, సమనాసి గంగారావులు కృషి చేసి వారి స్నేహితుల సమాచారాన్ని సేకరించి ఈ కార్యక్రమానికి దోహదపడ్డారు.

పర్యావరణానికి పొగ

- గ్రామాల్లో స్వాగతం పలుకుతున్న చెత్తకుప్పలు
- చెత్తకు నిప్పు పెట్టడంతో వ్యాపిస్తున్న దుర్గంధం
- నిత్యం శుభ్రం చేయాలని కోరుతున్న స్థానికులు



దివిలి ప్రధాన రహదారిలో చెత్తకు నిప్పు పెట్టడంతో వ్యాపిస్తున్న పొగ

పెద్దాపురం: గ్రామ పొలిమేరలు, వీధుల్లో చెత్త పేరుకుపోయి గ్రామాలు డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. ఆ చెత్త కుప్పలకు నిప్పు పెడుతుండడంతో దట్టమైన పొగ వ్యాపించి స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఇబ్బంది పెడుతోంది. మండలంలోని ప్రతి గ్రామం కాలుష్యం కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది.

ప్రతి గ్రామంలో, ప్రతీ వార్డులో వీధులన్నీ చెత్తమయమైపోతున్నాయి. మండలంలోని కాండ్రకోట, దివిలి వెంబడి పలు ప్రాంతాల్లోనూ, గుడివాడ, సిరివాడ, మర్లావ తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లోనూ, వీధుల్లో రోడ్డు పక్కనే చెత్త గుట్టలుగా పోసేస్తున్నారు. గ్రామాల్లోకి వచ్చే వారికి ప్రధాన రహదారుల్లోని చెత్త కుప్పలే స్వాగతం పలుకుతున్నాయి. ఏ మాత్రం చిరుజల్లులు కురిసినా చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది.

నిప్పుతోనే ముప్పు

గ్రామాల్లోనూ, వీధుల్లోనూ చెత్తను రోజుల తరబడి పంచాయతీ సిబ్బంది తరలించకపోవడంతో చెత్త పేరుకుపోతోంది. దీంతో రహదారులు కుంచించుకుపోతున్నాయి. ఎదురెదురు వాహనాలు కూడా దాటుకువెళ్లలేని పరిస్థితులు కూడా ఉన్నాయి. ఈ చెత్తకు నిప్పు పెట్టిన తర్వాత గంటలు, రోజుల తరబడి పొగ వ్యాపిస్తూనే ఉంటోంది. అధికారులు చర్యలు తీసుకుని, కాలుష్యాన్ని నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో చెత్తకుప్పలకు నిప్పు పెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడుతోంది. నివాస ప్రాంతాల సమీపంలో చెత్తకు నిప్పు పెట్టరాదని, గ్రామానికి దూరంగా, నిర్జన ప్రదేశానికి తరలించే ఏర్పాట్లు చేయాలని సచివాలయాల సిబ్బందిని ఆదేశిస్తాం.

– కె.హిమమహేశ్వరి, ఇన్‌చార్జి ఎంపీడీఓ, పెద్దాపురం మండలం

అలరించిన తోప్పూర్ గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న తోప్పూర్ సాయిరామ్ తదితరులు

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు తోప్పూర్ సాయిరామ్ గాత్ర కచేరీ ప్రేక్షకులను అలరించింది. సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిర్‌లో రెండు రోజులుగా 75వ సంక్రాంతి వార్షికోత్సవాల పేరిట నిర్వహిస్తున్నారు. మోహనరాగంలో ' నను పాలింప...' పతువరాళి రాగంలో 'శంభో మహాదేవ...' తదితర కీర్తనలను సాయిరాం ఆలపించారు. మహదాసు శ్యాం నీలాద్రిరావు వయోలిన్, మహాదాసు ఏడుకొండలు మృదంగం, సరస్వతుల హనుమంతురావు ఘటంతో చక్కని సంగీత సహకారం అందజేశారు. తొలుత రాష్ట్రస్థాయి సంగీత గాత్ర వీణా వాద్య పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సభాధ్యక్షుడు నారాయణం మురళి, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, ఆర్‌ఏ రావు, హిమబిందు, చావలి సూర్యకుమారి, ఎస్‌కేవీడీ వెంకట్రావు, మణిబాబు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.